# కలలు కనే కళ్ళు

## కె.వి.యస్. లక్ష్మి

బోసి పాప నవ్వులా చల్లగా వుంది ఎండ. ఎనిమిదిగంటలైనా యింకా ఏడుగంటలే అయినట్లు వుంది. మంచు తెరలు పూర్తిగా విడిపోలేదు. ముత్యాల్లా మెరుస్తూన్న మంచు బిందువులను తుడుచుకుందామన్న ధ్యాసేనా లేకుండా మత్తుగా కళ్లు మూసుకున్నట్లు నిశ్చలంగా వున్నాయి గులాబీలు.

భర్తని ఆఫీసుకు సాగనంపి గేటు దగ్గర నిల్చునివుంది మాధవి. అతను కనుమరుగు అయేవరకూ చూస్తూ నుంచుని వుంది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. "అబ్బ ఏమి ఉద్యోగమో బాబూ! పొద్దునే వెళ్ళిపోయి సాయంకాలానికిగానీ రారు" అని ముద్దుగా భర్తని విసుక్కుంది. ఫ్రెండ్స్ ఎవరూలేరు ఎలా బాబూ పొద్దస్తమానూ గడపటం అన్న తన మాటలకు భర్త చెప్పిన సమాధానం గుర్తుకువచ్చి, బుగ్గలు ఎర్రగా కాగా, పెదాలు సిగ్గుగా నవ్వుకున్నాయి. "రాత్రి జరిగిందంతా పొద్దస్తమానం గుర్తు తెచ్చుకో అదే పొద్దు పోతుంది"—అదీ భర్తగారి సలహా.

కారు హారన్ మోత వినపడటంతో మాధవి దృష్టి చెదిరింది. ఎదురింటివైపు కుతూహలంగా చూచింది. ఆ యింటి యజమాని అసహనంగా కారు హారన్ కొడుతున్నాడు. కమింగ్ డాడీ అంటూ ముత్యాల్లావున్న ఇద్దరు పిల్లలు పరుగెత్తుకుంటూ వచ్చారు. వాళ్ళ వీపులమీద స్కూల్‌బాగ్స్ వున్నాయి. వెనకాలే,వాళ్ళ అమ్మ కాబోలు రెండు కారియర్‌లు పట్టుకునివచ్చి లోపల పెట్టింది. 'మమ్మీ! టాటా' అన్నారు పిల్లలు. ఆమెకూడా నవ్వుతూ చేతులూపింది. కారు కదిలింది.

అక్కడే రెండు నిముషాలు నిల్చుంది. మాధవి ఆమెనే కన్నార్పకుండా చూసింది. సిసలైన మోడల్ గృహిణిలా వుందామె. తెల్లగా నాజూకుగా వుంది. ఆ స్త్రీ నలగని హాండ్‌లూమ్ చీరకట్టుకుని, దేవతలా వుంది. నిర్మలంగా వున్నాయి ఆమె కళ్ళు. 'అబ్బ! చాలా బాగుంది ఈవిడ' అనుకుంది మాధవి. అంతలో ఆమె గేటు మూసి లోపలికి వెళ్ళిపోయింది. 'నడకకూడా చాలా అందంగా హుందాగా వుంది' అని అనుకుంది మరోసారి.

తను వచ్చినప్పటి నుంచీ అంటే దాదాపు మూడు నెలలనించి చూస్తోంది ఆ యింటినీ, ఆ యింటిలోని మనుష్యులనీ. ఒకరికోసం ఒకరు సృష్టింపబడ్డారా! అనిపిస్తుంది. అతను ఎత్తుగా, బలంగా, మగసిరి ఉట్టిపడుతున్నట్లుగా వుంటాడు. ఛాయ తక్కువైనా ఆకర్షణీయంగా వుంటాడు. ఆమె! ఆమె మాత్రం!! ప్రబంధ నాయికలా వుంటుంది. ప్రబంధ నాయికలకు వుందో లేదో కానీ, ఆమెకు మాత్రం హుందాతనం వుంది. పిల్లలు ఇక చెప్పనక్కరలేదు. ఆరోగ్యంగా అందంగా రత్నాల్లా వుంటారు. చక్కటి కారు, అందమైన బంగళా. ఇవన్నీ కొంతమందికే వుంటాయి. తన కెప్పుడైనా కారులో తిరిగే అదృష్టం వుందో? లేదో? ఉస్సురని నిట్టూర్చింది మాధవి. ఆశకు అంతు వుండదు. ఉన్నగొద్దీ ఇంకా ఏదో లోటు వుంటూనే వుంటుంది. అది తెలియక కాదు. కానీ మనిషి యింకా ఏదో దేనికోసమో వగస్తూనే వుంటాడు. అది మానవ నైజం. ఎండ మీదపడి చురుక్కు మనటంతో లోపలికి పరుగెత్తింది మాధవి.

* * *

మర్నాడు భర్తను ఆఫీసుకి పంపి, గేటు

దగ్గరే నిలబడింది మాధవి. ఈ రోజు ఎలాగైనా పరిచయం చేసుకోవాలి ఆ ఎదురింటి ఏంజెల్‌ని, అని నిశ్చయించుకుంది. కొద్ది నిముషాల్లోనే పిల్లలు నవ్వుకుంటూ వచ్చి కారెక్కారు. మమ్మీ! టాటా! ముద్దు కంఠాల్తో వీడ్కోలు చెప్తున్నారు. "జాగ్రత్త దీపూ! ఈ రోజు డాడీ రారు. రేణుకా ఆంటీతో వచ్చేయండీ సరేనా!? వాసూ జాగ్రత్త. అన్నయ్యమాట విను" ఆవిడ హెచ్చరించింది. మాధవి మనసు సంతోషంతో త్రుళ్ళిపడింది. హమ్మయ్య! వీళ్ళు తెలుగు వాళ్ళే! ఫ్రెండ్‌షిప్ చేసుకోవచ్చు. 'అలాగే మమ్మీ' కోరస్‌గా పలికాయి ముద్దుకంఠాలు.



కారు కదిలింది,

ఆమె గేటు దగ్గరే, వెళ్ళిపోయిన కారు వంకే చూస్తూ నిలబడింది. ఏదో తెలియని ఆనందం, ఆమె కళ్ళలో తొణికిసలాడుతోంది. బహుశా, తన ఇల్లు, సంసారం, పిల్లల గురించే కాబోలు. మాధవి గబగబా ఆమె వద్దకు పరుగెత్తుకుని వెళ్ళింది. "మీరు ... మీరు తెలుగువారేనా?"

"అవును" అని నవ్వింది ఆమె.

"నా కెవ్వరూ ఫ్రెండ్స్‌లేరండి. మీ ఇంటికి వస్తూ వుంటాను. సరేనా?"

"అలాగేనమ్మా! తప్పకుండా రా!" అంది ఆమె నవ్వుతూ.

"ఇప్పుడు నాకు పని వుందండీ. సాయంకాలం వస్తాను" అని, బెరుగ్గా అని తిరిగి ఇంట్లోకి వచ్చేసింది మాధవి. ఆమె గుండెలు సంతోషంతో ఎగిసిపడ్డాయి. 'మంచి దానిలాగానే వుంది. ఇలాంటి వాళ్ళను ఎవరైనా గౌరవిస్తారు' అనుకుంది.

సాయంకాలం నాలుగ్గంటలకు గబగబా ముస్తాబయి ఎదురింటికి బయలుదేరింది మాధవి. కాలింగ్ బెల్ మ్రోగించి, అదురుతున్న గుండెలతో నిలబడి వుంది. తలుపు తెరిచి చిరునవ్వుతో ఆహ్వానించింది ఆమె.

"మీ పేరేమిటి?" గబగబా అడుగుతోన్న మాధవిని చూసి నవ్వింది. 'నీలవేణి' అని చెప్పింది. "అబ్బ ఎంత బాగుందండీ మీ పేరు. అచ్చం మీ లాగేనే వుంది. చక్కగా మీ కన్నీ వున్నాయి. వినయం. విధే...."

బ్రేక్ పడింది మాధవి వాక్ప్రవాహానికి. "రామ్మా కూర్చో. ఇప్పుడే వస్తాను" అని లోపలికి వెళ్ళిపోయింది.

అక్కడే వున్న సోఫాలో కూర్చుని ఇంటి పరిశీలనలో పడింది మాధవి. చక్కటి డ్రాయింగ్ రూమ్. కార్పెట్, కార్పెట్ కి తగ్గట్లు, సోఫా సెట్, లైట్ గ్రీన్ కలర్ డిస్టెంబర్ గోడలు, కళాత్మకమైన చిత్రాలు, చాలా బాగుంది. ఇంతలో ట్రేలో రెండు జ్యూస్ గ్లాసులతో వచ్చింది నీలవేణి. 'తీసుకోమ్మా!' అంటూ ఒక గ్లాసు అందించింది. జ్యూస్ సిప్ చేస్తూ, "అదేం? మీ పిల్లలని ఈ రోజు వాళ్ళ డాడీ ఎందుకు తీసుకురారు?" అని అడిగింది. మాధవి బోళాతనానికి నవ్వింది నీలవేణి.

"నవ్వకండి. నామాట తీరే అంత. నాకు నచ్చిన మనుషులతో నేనలాగే మాట్లాడతాను. ఏమనుకోకండి. పొద్దున మీరు చెప్తోంటే విన్నాను."

ఖాళీ అయిన గ్లాసుని ట్రేలో పెడుతూ "వాళ్ళ డాడీ కాంప్ కి వెళతారు. వాళ్ళ టీచరు నా ఫ్రెండ్. ఆయన వెళ్ళినప్పుడల్లా తనే తీసుకొస్తుంది. మాకిది అలవాటే!" అంది నీలవేణి.

"ఏమిటీ? మీ వారికి ఎప్పుడూ కాంప్ లుంటాయా?"

అవునన్నట్లుగా తల ఊపింది. ఖాళీ గ్లాసులు ట్రే లోపలకి పెట్టటానికి లేచింది నీలవేణి. ఆమె తిరిగి రాగానే, తన సహజ ధోరణిలో కాసేపు తన ఫ్రెండ్స్ గురించి, కాలేజీ లైఫ్ గురించి బడబడా వాగింది మాధవి, మధ్య మధ్యలో జోక్స్ చెపుతూ. అయిదుంపావు వరకూ అలాగే గడిపింది.

హుషారుగా కూనిరాగాలు తీస్తూ ఇల్లు చేరిన మాధవి భర్త ఇంటికి రాగానే విశేషాలన్నీ చెప్పేసింది. బడబడా వాగడం తగ్గించుకోవే పిల్లా! అని నెత్తిమీద మొట్టి ముఖం కడుక్కోవటానికి లోపలికి వెళ్ళిపోయాడు అతను. స్నేహమేరా జీవితం....అని కూని రాగం తీసుకుంటూ కాఫీ తేవడానికి లోపలికి వెళ్ళింది మాధవి.

* * *

"నాకిదేం నచ్చలేదు" అంది మాధవి హఠాత్తుగా. కిచెన్ లో చైర్ మేద బైఠాయించింది ఆమె.

"ఏది?" అంది నవ్వాపుకుంటూ నీలవేణి.

"అదే మీరు నన్ను అమ్మా బొమ్మా అని పిలవటం. మీరు నా కంటే పెద్దని నేననుకోను."

"ఓహ్" అదా నేనింకా ఏదో అనుకున్నాను. నాకు ఇరవై ఎనిమిదేళ్ళు. దానినిబట్టి నువ్వే చెప్పు ఎవరు ఎవర్ని అమ్మా అని పిలవాలో!" అంటూ దోసెలు ప్లేటులోపెట్టి మాధవి చేతి కందించింది నీలవేణి.

"అయితే మీరు నాకంటే అయిదేళ్ళు పెద్దన్నమాట. మీరు అసలు అలాకనిపించరు,"

"నీ కాంప్లిమెంటుకి థాంక్స్‌గాని ముందు ఆ దోసెలు తిను, చల్లారిపోతున్నాయి" హెచ్చరించింది నీలవేణి. కాలింగ్ బజర్ మోగడంతో తలుపు తెరవడానికి వెళ్ళింది, నీలివేణి. బాబోయ్ లార్డ్ యమ కాదు కదా! అనుకుంది. నీలవేణి భర్త క్రిష్ణమోహన్ కి ఆపేరు పెట్టింది మాధవి, గంభీరంగా వుంటాడని. ఆమె అనుకున్నట్లే అయింది. వచ్చింది అతనే!

"బాబోయి నే వెళ్ళిపోతానండీ" అంది అప్పుడే లోపలికి వచ్చిన నీలవేణితో.

"ఎందుకూ! అంత భయం. మరేం ఫర్వాలేదు కూర్చో. ఆయన మళ్ళీ ఇప్పుడే వెళ్ళిపోతారులే" అని బలవంతంగా కూర్చోబెట్టి టిఫిన్ ప్లేటు తీసుకునివెళ్ళి భర్తకిచ్చి వచ్చింది నీలవేణి.

కొద్ది నిముషాలకి, "నీలవేణీ! మంచి నీళ్లు" అని అరిచాడు అతను. "ఆ! ఆ! వస్తున్నా! వస్తున్నా" తడబాటుతో సమాధానం చెప్పింది. అప్పటికే అతను వంటింటి గుమ్మం దగ్గరకు వచ్చేశాడు. మాధవి తడబాటుతో లేచినుంచుంది. "న....న....నమస్కారం" అంది. అతను ప్రతి నమస్కారం చేసాడు "మేము...మేము మీ ఎదురింట్లో ఉన్నాము" అంది. "ఓహో అలాగా!"

అని "మీవారేం చేస్తున్నారు? మీదే ఊరు?" అని వివరా లడిగాడు. అన్నిటికీ సమాధానం చెప్పింది మాధవి. ఇతనిని 'లార్డ్ యమ' అని పేరు పెట్టానుగానీ మంచివాడే; పొలైట్ గానే వున్నాడు అనుకుంది తనలో తాను. భార్య ఇచ్చిన మంచి నీళ్ళు తాగి, కాఫీ తీసుకుని వెళ్లి పోయాడు అతను. ఆ తర్వాత కొద్దిసేపువుండి ఇంటికి వచ్చేసింది మాధవి.

రోజులు గడుస్తున్నాయి. నీలవేణి, మాధవిల మధ్య స్నేహం బలపడింది. మాధవి నీలవేణిని అక్కా అని పిలుస్తోంది. ఒకరోజు మాధవి నీలవేణి యింటికి బయలుదేరింది. అక్కా అని అరుచుకుంటూ వచ్చిన మాధవి దృష్టి హాలులో సోఫాలో కూర్చున్న మనిషిపై పడింది. ఆమెకు సుమారు ముప్పై ఏళ్ళు వుండవచ్చు. "రా మాధవీ రా కూర్చో" కాఫీ కప్పుల ట్రే తీసుకువస్తూ అంది నీలవేణి.

సోఫాలో కూర్చుని ఆ వచ్చిన స్త్రీనే చూస్తూ కూర్చుంది మాధవి. పెదవులకి లిప్ స్టిక్, బాబ్డ్ హెయిర్, మాక్సీ స్కర్ట్-ఇదీ ఆవిడ వేషం. ఆవిడకు మాధవిని పరిచయం చేసింది. ఆవిడ నార్త్ ఇండియన్ అట. తెలుగురాదట. వారిద్దరూ ఇంగ్లీషులోనే మాట్లాడుకోసాగారు. మధ్య మధ్యలో మాధవి ముక్తసరిగా అడిగిన దానికి జవాబు యివ్వసాగింది. కొంచెం సేపువుండి ఆమె వెళ్ళిపోయింది! ఆమెను సాగనంపి వచ్చి కుర్చీలో కూర్చుని ఉస్సురని చిన్నగా నిట్టూర్చింది నీలవేణి.

"అదేమక్కా ఈ రోజు అలసటగా వున్నారు?"

"రేపు దీపూ బర్త్ డే. చిన్న పార్టీ ఇస్తున్నాను. దాని ఏర్పాట్లు చూసేసరికి అలసటగా వుంది. అంతే."

"మరి నన్ను పిలవకూడదా? నా సహాయం తీసుకోకూడదా?" నిష్ఠూరం ధ్వనించింది మాధవి మాటల్లో.

"పరవాలేదు లేమ్మా; ఎంత పనని?" తేలిగ్గా కొట్టి పారేసింది నీలవేణి.

" ఇంతకీ సరేగానీ ఆవిడనిచూస్తే నీకేమనిపించింది" అంది హఠాత్తుగా నీలవేణి.

"ఎవరు?" ఆవిడేనా?? ఆ ముప్పయేళ్ళ బాలాకుమారి?"

"అదే ఆవిడే!! ఆవిడ పేరు సుషమ. బాంక్ మేనేజర్."

"అలాగా నామొహంలాగానే వుంది. ఎలాగైనా మీకన్నా అందంగా మాత్రంలేదు. ఏం అలా అడిగారు?"

"అబ్బే ఏంలేదు ఊరికే అడిగాను. రేపు సాయంత్రం తప్పకుండా రావాలి నువ్వు. సరేనా?"

"ఓ తప్పకుండా వస్తానుగానీ నా సహాయం తప్పనిసరిగా తీసుకోవాలి. లేకపోతే నేను ఒప్పుకోను. సరేనా??" అంది మాధవి.

"అన్ని ఏర్పాట్లూ నీకు అప్పగించేస్తాను తల్లీ కోప్పడకు" నీలవేణి మాటలకు నవ్వేసింది మాధవి. కాస్సేపు ఆమాటా ఈమాటా చెప్పి ఇంటికి బయలుదేరింది.

ఆ సాయింత్రం భర్తతో కలిసి బజారుకి వెళ్ళి, దీపూకోసం మంచి ప్రెజంటేషను కొని తీసుకువచ్చింది. ఆ మర్నాడు బాగా ముస్తాబయి ప్రజంటేషన్ పాకెట్ తీసుకుని నీలవేణి ఇంటికి వెళ్ళింది మాధవి. హాలంతా డెకరేట్ చేసింది నీలవేణి. మధ్యలో టేబిల్ వేసి బర్త్ డే కేక్ ఎరేంజ్ చేసి వుంది.

"త్వరగా రా. నీ కోసమే చూస్తున్నాను"అని సాదరంగా లోపలికి తీసుకువెళ్ళింది.

"దీపూ! ఆంటీకి దణ్ణంపెట్టు" అంటూ దీపూచేత మాధవి కాళ్ళకి దణ్ణం పెట్టించింది. అక్షింతలువేసి ఆశీర్వదించి చేతిలో పాకెట్ దీపూ చేతిలో పెట్టింది మాధవి.

"ఎప్పుడొస్తారక్కా గెస్ట్ లంతా?" నలువైపులా చేసిన డెకరేషన్స్ చూస్తూ అడిగింది మాధవి.

"గెస్ట్ లంటే పెద్దవాళ్ళని పిలవలేదు, ఊరికే పిల్లల్నే పిలిచింది. ఇంకెంత రెండు నిముషాల్లో వచ్చేస్తారంతా!" అంది వీధిలోకి చూస్తూ నీలవేణి. కొద్ది క్షణాల్లో పిల్లలంతా వచ్చేసారు. వాళ్ళంతా హేపీ బర్త్ డే అని పాడుతోంటే కేక్ కట్ చేశాడు దీపూ. చిన్న కేక్ ముక్కని

నీలవేణి నోట్లో ఉంచాడు. నీలవేణి తిరిగి చిన్న కేక్‌ముక్కని వాడి నోట్లో పెట్టింది. పిల్లలందరికీ స్వీట్సు కేకూ బొమ్మలూ పంచిపెట్టింది. వాళ్ళు కాసేపుండి అల్లరిచేసి వెళ్ళిపోయారు.

'మమ్మీ' అంటూ దీపూ పరుగెత్తుకుంటూ వచ్చి చుట్టేశాడు నీలవేణిని. ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. వాడిని ఎత్తుకుని ముద్దులతో ముంచెత్తింది; గుండెల కదుముకుని వెక్కి-వెక్కి-ఏడ్వసాగింది. కలవరపడిపోయింది మాధవి. వాసవి పక్కనే బిక్కు-బిక్కుమని చూడసాగింది. "అరె! ఎందుకక్కా ఏడుస్తున్నారు? ప్లీజ్ చెప్పరూ;" ఆందోళన పడసాగింది మాధవి.

"ఏమీ లేదమ్మా ఆనందబాష్పాలు. అంతే!" కళ్ళు తుడుచుకుంది నీలవేణి.

"నేను నమ్మను. ఆనంద బాష్పాలైతే వెక్కి-వెక్కి ఏడుస్తారేమిటి ఎవరైనా. ప్లీజ్ చెప్పండి" ఆప్యాయంగా అడిగింది మాధవి.

"ఏమీ లేదమ్మా నన్ను నమ్ము. అది సరేగానీ మాధవీ నేను పిల్లల్ని ఇప్పుడు సినిమాకి తీసుకు వెళ్ళాలనుకుంటున్నాను. ఏమనుకోకుండా నాతో రాగలవా?" చిరునవ్వు బలవంతాన ముఖంమీదకు తెచ్చుకుంటూ అడిగింది నీలవేణి.

"తప్పకుండా. మీరు ముఖం కడుక్కుని రండి" అంది మాధవి. నీలవేణి ఎందుకో బాధపడుతోంది. అది ఈరోజే తెలిసింది తనకి. ఎలా ఆమెను ఓదార్చటం? పరిపరి విధాల ఆలోచించసాగింది మాధవి. తాత్కాలిక ఉపశమనం చేకూర్చినట్లు అవుతుందని ఆమెకూడా సినిమాకి బయలుదేరింది. మధ్య జోక్స్ చెప్పి నవ్వించింది. రాత్రి పడుకున్నా ఆ ఆలోచనలు వదల్లేదు మాధవిని.

* * *

మర్నాడు మాధవి నీలవేణి దగ్గరకు వెళ్ళింది. ఆమె ఏమీ బాధపడినట్లుగాలేదు. నిర్మలంగా నవ్వుతూ ఆహ్వానించింది. తను




ఊరికే పొరబడిందేమో; ఆమె దేనిగురించీ బాధపడటం లేదేమో అనుకుని కదపటం ఎందుకని ఊరుకుంది. రోజులు గడుస్తున్నాయి ఎవరి దినచర్యలోనూ మార్పులేదు.

ఒకరోజు మాధవి హఠాత్తుగా అంది నీల వేణితో "అక్కా మీరు దీపావళి రోజు ఎందుకు బాధపడ్డారో చెప్పనా? క్రిష్ణమోహన్ గారు పార్టీలో లేరని కదూ?" సూటిగా అడుగు తున్న ఆమెను చూసి తడబడింది నీలవేణి. ఒక్క క్షణం ఆమె ముఖం మ్లానమైంది. వెంటనే తేరుకుని నవ్వేస్తూ "పిచ్చి పిల్లా ఆరోజు ఆయన కాంపు కెళ్ళారు. అంతే! నేను దేని గురించీ బాధపడలేదు. నువ్వు అనవస రంగా అపోహపడకు. ఉండు వాసూ స్వెట్టరు ఈరోజు అయినా పూర్తి చేయాలి." అని లేచి లోపలికి వెళ్ళింది. ఊలూ, నీడిల్స్ తీసుకు వచ్చి అల్లసాగింది. కాస్సేపు ఆ కబుర్లు ఈ కబుర్లుచెప్పి లేచింది మాధవి. "నువ్వు లేక పోతే నేనేమయి పోయేదాన్నో అనిపిస్తుంది ఒకోసారి" అంది నీలవేణి మాధవిని సాగ నంపుతూ. మాధవికి ఆమె మాటలు అర్థం కాక అయోమయంగా చూసింది.

* * *

"మిమ్మల్ని చూస్తే జెలసీగా ఉంది నాకు" అంది మాధవి కర్చీఫ్‌కి పోగులుతీస్తూ, కళ్ళ కొసల నించి చూడసాగింది.

"ఏం? ఎందుకూ?" ఆశ్చర్యం ప్రతి ఫలిం చింది నీలవేణి కళ్ళల్లో!

"ఎందుకేమిటి? చక్కగా స్వంత బంగళా, కారు, ఇంటినిండా ఫర్నిచరు, రత్నాల్లాంటి బిడ్డలు, ప్రేమగా చూసుకునే బంగారంలాంటి మొగుడూ, హోదా—"

"ఆపు ఆపు ఇంక చాలు" నీలవేణి ముఖం మ్లానమైంది.

"నాలాంటి దురదృష్టవంతులు ఈ ప్రపం చంలో వుండరు. ఉండకూడదనే నేను కోరు కునేది" ఆవేదనగా అంది నీలవేణి.


"అదేం? మీకు వచ్చిన లోటేమిటి" కళ్ళె గరేస్తూ అడిగింది మాధవి.

"నా కంతా లోటేనమ్మా. అందరికీ లభిం చేదే నాకు లేదు. నా చెల్లెలిలాంటి దానవు. ఎందుకో నీతో చెప్పుకోవాలని పిస్తోంది నాకు. నాకూ, నా భర్తకీ మధ్య భార్యాభర్తల అను బంధంలేదు."

మాధవి ఉలిక్కిపడింది, "నిజంగానా?" కళ్ళు పెద్దవిచేస్తూ అడిగింది.

"అబద్ధం చెప్పవలసిన అవసరమేముం దమ్మా. పెళ్ళయిన తర్వాత ఒక ఏడాది సుఖ పడి వుంటానంతే! అంతే! ఆ తర్వాత.... ఆ తర్వాత...." మాట్లాడలేకపోయిందామె. కాసేపుండి తిరిగి చెప్పసాగింది.

"నేను ఒక శ్రీమంతుడి కూతుర్ని. చదువు, అందం, డబ్బు అన్నీ వుండేవి. దానికి తగ్గట్లు కొంచెం గర్వంకూడ వుండేది. దురహంకారం కాదు సుమా! ఎంతోమంది నాకు లవ్‌లెటర్స్ రాసేవారు. నన్ను పెళ్ళి చేసుకోవాలనుకునే వారు. అందర్నీ గడ్డిపరకలా తీసిపారేసాను. ఇప్పుడనిపిస్తుంది. వాళ్ళలో ఏ ఒక్కరిని చేసు కున్నా నా జీవితం యింకోలా వుండేది. ఆనం దంగా వుందేది. ఇప్పుడనుకుంటాను. ఏం లాభం? నేను అందరి ఆడపిల్లల్లాగ కలలు కనేదాన్ని కాదు అలాంటివాడు, ఇలాంటి వాడు కావాలని. నాకు తెలుసు నా అందం, చదువు, హోదాలకు సరితూగేవాడు వస్తాడని. ప్రేమగా చూసుకుంటాడనీ తెలుసు. నేను గర్విష్ఠినయినా దుర్మార్గురాలినికాదు, దుర హంకారిని కాను. ఏదో పిచ్చినమ్మకం. అలాగే నేను మెచ్చినవాణ్ణి చేసుకున్నాను. అతనికి అనుమానం. ఏదో నా డబ్బును చూసుకుని గర్వంగా తనని ధిక్కరిస్తానని, ఏదో అంటూ వుండేవాడు. నేనూ ఊరుకునే దాన్నికాదు. మాటకి మాట. ఫలితం పోట్లాటలు, ఏడుపులు, అశాంతి. కొన్నాళ్ళవరకూ మాకు దైహికంగా సంబంధం వుండేది. ఆ తర్వాత అదీవుండేది కాదు. దానికి కారణం ఆ తర్వాత తెలిసింది. మంచి వరువంలో వున్న వయసు. భర్త కర్క శుడు. సెక్స్ అర్జ్‌తో వేగిపోయేదాన్ని, ఆ క్షణంలో నాకనిపించేది ఎవరితో నన్నా వెళ్ళి




పోదామని. కానీ... కానీ....ఆ పని చేయలేక పోయే దాన్ని. కారణం పరువు ప్రతిష్టలు. సంఘంలో పేరు వున్న వాడి కూతుర్ని, పేరు గలవాడి కోడల్ని, పేరుగలవాడి భార్యని. ఎంత అసహ్యంగా వుంటుంది?? అదీకాక ఈ తుచ్ఛమైన శారీరక వాంఛకోసం ఎవడితో నన్నా వెళ్ళినా వాడు నన్ను పెళ్ళి చేసుకుని భార్యలా గౌరవిస్తాడని నమ్మకంలేదు. ఆ అపనమ్మకం వలనే నేను ఆ పని చేయలేదు చేయలేక పోయాను. ఆ పరిస్థితుల్లోనే ఆయన సుషమతో సంబంధం పెట్టుకున్నారు''

ఆశ్చర్యంతో మాధవి కళ్ళ పెద్దవి అయ్యాయి ''నేను చూసాను. నేను చూసిన ఆ సుషమేనా'' అడిగింది.

ఆమే అన్నట్లు సైగ చేసింది నీలవేణి, ''పోట్లాడే దాన్ని. నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారని ఏడ్చేదాన్ని. దానికి అతని సమాధాన మేమిటో తెలుసా? నేను గర్విష్టినట, దానికి తగ్గ శాస్తి చేస్తున్నారట. ఏడుస్తూ వుండి పోయాను. ఆయనకు అడ్డుచెప్పేదాన్ని కాదు.

నాలో కసి చెలరేగింది, అతనితో గొడవ పెట్టుకుని విడిపోతే అతనికేం బాధలేదు. ఉన్న అడ్డూ అపూ తొలగిపోతుంది. అప్పుడు పబ్లిగ్గా సుషమని పెళ్ళి చేసుకోవచ్చు. ఆ ఉద్దేశ్యం నేను కనిపెట్టాను. అందుకే విడిపోలేదు. నాకసి తీరుతుంది. ఎంత ఆమెతో తిరిగినా పబ్లిగ్గా తిరగలేడు కదా! నా భార్య అని అందరితో చెప్పలేడు కదా! ఎలాగూ ఇతన్ని విడిచి నేను బావుకునేదేమీలేదు. ఎలాగూ నా సుఖ సంతోషాలు మళ్ళీ జన్మతోనే ముడిపడి వున్నాయి. ఏదో అశాంతి, ఒంటరి తనం, శరీర తాపం, వాంఛ. అప్పుడే ఒక తప్పు చేసాను.'' ఆగి ఊపిరి తీసుకుంది నీలవేణి. భయం భయంగా చూసింది మాధవి. నవ్వింది నీలవేణి. ''నేను... నేను....ప్రొవకేట్ చేసి ఆయన ద్వారా ఈ పిల్లల్ని కన్నాను, అసహ్యం వేస్తోంది కదూ! నామీద?'' మాధవి భుజం కుదుపుతూ అడిగింది నీలవేణి.

''అప్పుడు అలా అసహ్యంగా ప్రవర్తించక పోతే ఈ రత్నాలు నాకు దక్కేవారా? చెప్పు. ఇప్పుడు వాళ్ళే నా సర్వస్వం. వాళ్ళే నాలోకం వాళ్ళే నా ప్రాణం వాళ్ళకోసమే బ్రతుకుతున్నాను'' కారుతున్న కన్నీటిని చీరచెంగుతో వత్తుకుంది నీలవేణి,

''వాళ్ళ గురించి ఏమీ పట్టించుకోరు

ఆయన. వంశాకురాలన్న ధ్యాసకూడా లేదు ఆయనకి. ఎప్పుడైనా నేను చూడకుండా ముద్దు చేస్తారు అంతే! దానికే నాకు పరమసంతోషం. దీపూ బర్త్‌డేనాడు అందుకే ఏడ్చాను. పిల్లలు పుట్టాక నాలో శరీర వాంఛలు చచ్చిపోయాయి. నేనే నా మనసుని సంబాళించుకున్నాను. భగవత్ సేవలో గడిపేస్తాను. ఎన్ని పూజలున్నాయో, ఎన్ని వ్రతాలున్నాయో నాకు తెలుసు. అవన్నీ చేస్తాను. అదే నాకు శాంతి. ఇంటిపని ఉపశాంతి. పిల్లల సంరక్షణ నాకు ఆనందం. జీతం ఒక ఏడు వందలు పడేస్తారు, నా ముఖాన్న. మిగిలిన జీతమంతా ప్రియురాలికే! నాకో ఇల్లు వుంది. ఆ ఇంటిమీద అద్దె మూడు వందలొస్తుంది. ఈ వెయ్యి రూపాయిలతోటి సంసారాన్ని లాక్కుని వస్తున్నాను. ఎంతపని కల్పించుకుని చేసినా తీరిక మిగులుతుంది. ఆ తీరిక వేళల్లో ఇల్లు అలంకరిస్తాను. బొమ్మలు చేస్తాను; సంగీతం నేర్చుకుంటాను. నేను సినిమాలు చూడను, కథలు చదవను. ఎక్కడికీ వెళ్ళను. కారణం—ఎక్కడ చూసినా భార్యాభర్తల అన్యోన్యత కనిపిస్తుంది. నాకు లేనిది అదే! అందుకే పిల్లలకి కార్టూను ఫిల్మ్స్ చూపిస్తూ వుంటాను. నా కొడుక్కి పెళ్ళాన్ని ఎంత అపురూపంగా చూసుకోవాలో నేర్పుతాను, నాకు ఇప్పుడు ఏ ఆశలులేవు. ఏ కోరికలులేవు. కానీ ఏపని చేసినా మనసు ఆలోచించడం మానదు కదా! నేను కన్నె పిల్లలాగ కలలు కంటూ వుంటాను, అది ఏమిటో తెలుసా? డబ్బు వున్నా లేకపోయినా ప్రేమగా చూసుకునే భర్త గురించి. దేవుని ప్రార్థించేది అదే!"

శిలాప్రతిమే అయిపోయింది మాధవి. దీపూ, వాసూ స్కూలునించి వచ్చారు. ఇద్దర్నీ గుండెలకు గాఢంగా హత్తుకుంది నీలవేణి. "ఏం పొందినా పొందకపోయినా వీళ్ళని పొందాను అంతే చాలు ఈ జన్మకి" అంటూ గొణుక్కుంది పిచ్చిదానిలా.

"ఏమ్మా బోర్ కొట్టానా?" నవ్వుతూ అడిగింది నీలవేణి ఆ ఎమోషన్ నించి కొంచెం తేరుకొన్నాక. "అబ్బే, లేదు లేదు" తడబడింది మాధవి.

'ఈ ఏంజిల్, ఈ సుగుణాలఖని వెనుక ఇంత విషాద గాథ వుందా?' పిల్లల్ని ముద్దులాడుతోన్న నీలవేణి కేసి చూసి బలవంతంగా నవ్వింది మాధవి. ఎప్పటిలా నిర్మలంగా నవ్వింది నీలవేణి. ఆ కళ్ళు కాంతులను విరజిమ్ముతున్నాయి. □


నవలల పోటీ గడువు

అక్టోబరు 31, 1978

వరకూ పొడిగించబడినది

రచయితలు గమనించగలరు!